





నరసన్న.. చూడన్నా!

అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి తెప్పోత్సవం ఆదివారం వశిష్ఠ గోదావరిలో కన్నుల పండువగా సాగింది.. వేలాదిగా భక్తజనం హాజరై స్వామిని కన్నులారా తిలకించారు.. చల్లంగ చూడు నరసన్న అంటూ కొలిచారు..



ఊరేగిన వెంకన్న..

ఆ స్వామి వైభవాన్ని చూడడానికి రెండు కన్నులూ చాలవు.. అంతలా వాడపల్లి వేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం ఆదివారం గౌతమి గోదావరిలో నిర్వహించారు. అందంగా అలంకరించిన తెప్పపై స్వామి ఊరేగారు. వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.



సత్యదేవ.. కనవా!

అన్నవరం సత్యదేవుడి హంస వాహనం ఆకట్టుకుంది.. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామి తెప్పోత్సవం పంపానదిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.

బతుకులపై హాల్‌సెల్!



ప్రస్తుతం సెల్‌ఫోన్ చాలా ప్రమాదకరంగా తయారైంది.. అది చేతిలో ఉంటే అన్నీ ఉన్నట్టే.. ఫ్రెండ్స్ కావాలంటే ఫ్రెండ్స్‌ని ఇస్తోంది.. ప్రేమికుడు కావాలన్నా.. ప్రేమికురాలు కావాలన్నా క్షణాల్లో ఇచ్చేస్తోంది.. అవి కాకుండా వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, షేర్‌చాట్ తదితర యాప్‌లు ఉన్నాయి.. ఈ సెల్‌ఫోన్‌కు యువత బానిసగా మారిపోతున్నారు.. గంటల తరబడి చాటింగ్‌లు.. గంటల తరబడి టాకింగ్‌లు.. గంటల తరబడి ఆటలు... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నోఎన్నెన్నో.. చదువును వదిలేసి మరి ఆ మాయలో మునిగితేలుతున్నారు.. తెలిసీతెలియని వయసులో యువతకు అదో ప్రేమమార్గంగా ఉంది.. అది కట్టడి చేయడానికి తల్లిదండ్రులు శతవిధాలా ప్రయత్నిస్తున్నా అందులో చిక్కుకుపోయే యువతే ఎక్కువ.. సెల్ ఫోన్ ఎంత అవసరమో.. అంతే నాశనం కూడా చేస్తుందనేది జగమెరిగిన సత్యం.

జీవితంపై అలక్ష్యం!



ప్రస్తుతం ఒక లక్ష్యం పెట్టుకుని చదివే యువత చాలా తక్కువ శాతం కనిపిస్తున్నారు.. తల్లిదండ్రుల పోరు తప్ప.. ఏదో ఒకటి సాధిద్దాం అని చదువుకునే యువతరాన్ని వేళ్లపై లెక్కించవచ్చు.. తెలిసీతెలియని వయసులో ఆశలు.. కోరికలంటూ పరుగులు పెడుతున్నారు.. ఆశయాలను వదిలేస్తున్నారు.. బడి దగ్గర నుంచి కళాశాలల వరకూ ఎన్నెన్నో ప్రేమకథలు.. జీవితంలో ఏదో ఒకటి సాధించిన తరువాత ప్రేమించుకుంటే తప్పులేదు. కానీ ఏమీ లేకుండా ప్రేమ అంటున్నారు.. ఆ దోమ కుట్టడంతోనే అన్నీ గాలికే వదిలేస్తున్నారు.. ఆ ప్రేమ మోజులో పడి మోసపోయిన బాలికలు కోకొల్లలు.. మన జిల్లాలోనే చూస్తే ఏడో తరగతి చదివే బాలికలు గర్భవతులు.. ఇంజనీరింగ్ చదివే అమ్మాయి మోసపోతూనే ఉంటున్నారంటే పరిస్థితి ఎంత చేయి దాటుతుందో అర్థం చేసుకోవచ్చు.

కోరికల ఊబిలో చిక్కుకుని..



కోరికలే గుర్రాలైతే.. అనే సామెత ఒకటుంది.. ఇది అమ్మాయికైనా.. అబ్బాయికైనా ఒక్కటే.. కోరికలు ఉండవచ్చు కానీ మితిమీరకూడదు.. ప్రస్తుతం కోరికలు మితిమీరిపోతున్నాయి. అవే యువతీ యువకులను.. బాలికలను పక్కదారి పట్టిస్తున్నాయి.. చాలా మంది బాలబాలికలు హీరోహీరోయిన్లను ప్రేమిస్తారు. వారిలా ఉండాలని తహతహలాడతారు.. అది చాలా ఖర్చుతో కూడుకున్నది.. ఆర్థిక అవసరాలకు చాలా మంది బాలికలు పక్కదారి పడుతున్నారు.. అదే వ్యసనంగా మార్చుకుంటున్నారు.. చదువుకున్నా ఏం చేసినా అదే ఆలోచన.. చదువును పక్కన పెట్టి ఎంతో మంది బాలికలు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. చదువుకునే వయసులో చదువుకుంటే భవిష్యత్ చాలా అందంగా ఉంటుంది. అది చాలా ఆలోచించకుండా కోరికలనే ఊబిలో చిక్కిపోతున్నారు.

కాకినాడలో స్విమ్మింగ్ పోటీల ఎంపికలు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా స్విమ్మింగ్ పోటీలు కాకినాడస్పోర్ట్స్‌అథారిటీ స్టేడియం స్విమ్మింగ్‌పూల్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. 2008-18 మధ్య పుట్టిన బాలబాలికలను ఐదుగ్రూపుల్లో ఎంపిక చేశారు. 85మంది హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22, 23 తేదీల్లో విశాఖపట్నం వేదికగా జరగబోయే రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో పాల్గొంటారు. గ్రూపు 4,5 విభాగాల్లో ఎంపికైనవారు ఈనెల 16న విజయవాడలో జరగబోయే రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో పాల్గొంటారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్, కార్యదర్శి ఇరుసమల్ల రాజు, ముఖ్య సలహాదారు మంగా వెంకటశివరామకృష్ణ ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. కాకినాడ జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి(డీఎస్‌డీవో) సతీష్‌కుమార్, విశిష్టఅతిథిగా లయన్స్ క్లబ్ ఉమ్మడి పశ్చిమ గోదావరి గవర్నర్ మాదిరెడ్డి బాబూరావు హాజరై క్రీడాకారులను అభినందించారు.

చదువుకునేందుకు ఊరు కాని ఊరొచ్చింది.. ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూనే విద్యనభ్యసిస్తోంది.. సెల్‌ఫోన్‌లో పరిచయం ఒక యువకుడిని అన్నగా చెప్పుకునే వరకూ వెళ్లింది.. దీపావళి ముందు రోజు ఆ అన్నయ్య వచ్చాడు.. దీపావళి బాణసంచా కొని ఇస్తానని చెప్పి తీసుకెళ్లాడు. అన్నయ్య కదా అని నమ్మి వెళ్లింది. రెండు గంటల తరువాత ఒంటిపై గాయాలతో తిరిగొచ్చింది. అనుమానం వచ్చిన వార్డెన్ ఆరా తీస్తే.. జరిగింది చెప్పి గొల్లుమంది.. రాజమహేంద్రవరంలో జరిగిన ఈ సంఘటన సెల్‌ఫోన్ పరిచయం ఎంత ప్రమాదకరమో చెబుతోంది.

ఆ బాలిక 7వ తరగతి చదువుతోంది.. తెలిసీ తెలియని వయసు.. అందునా అమ్మానాన్న లేరు.. అమ్మమ్మ వద్ద ఉండి గురుకులంలో చదువుకుంటుంది.. అమ్మమ్మ ఊరికే చెందిన తాత వయసున్న వ్యక్తి ఆ బాలికను పరిచయం చేసుకున్నాడు.. బాలికకు ఎవరూ లేకపోవడంతో ఖాళీ ఉన్నప్పుడల్లా అతను వెళ్లేవాడు.. గురుకులంలో తాతగా చెప్పుకుని బయటకు రమ్మనేవాడు. బాలిక ఊరే కావడంతో అతనితో వెళ్లేది.. అలా నాలుగుసార్లు వెళ్లింది.. నాలుగోసారి అతనిలో వికృత రూపం బయటపడింది.. తెలిసినా బాలికలు ఒకరి వెంట వెళ్లడం ఎంత ప్రమాదకరమో తునిలో జరిగిన ఈ సంఘటన రుజువు చేస్తోంది.

- రాజమహేంద్రవరం/ కాకినాడ-ఆంధ్రజ్యోతి



స్వాతంత్రం.. స్వేచ్ఛ.. రెండిటికీ మధ్య యోజనాల వ్యత్యాసం ఉందని పెద్దలు చెప్పే మాట అక్షర సత్యమని ఛిద్రమవుతున్న బాలికలు/అమ్మాయిల జీవితాలు రుజువు చేస్తున్నాయి. రకరకాల కారణాలతో ప్రేమ.. ఆకర్షణ.. అవసరం.. వాంఛ.. వీటి మధ్య ఉన్న సున్నితమైన గీతను గుర్తించడంలో విఫలమవుతున్నారు. తమంతట తాముగా వెళ్లి జీవితాలను, తల్లిదండ్రుల ఆశలను ఛిద్రం చేసే వలకు చిక్కు తూ..చిక్కుముడుల సుడిగుండంలో ఇరుక్కుంటున్నారు. తీరా సున్నితమైన గీత దాటామని గ్రహించే సరికి జీవి తాలు వేరొకరి వాంఛల గుప్పిట్లో బందీలవుతున్నాయి. బంధువులు సైతం కీచకులుగా మారుతున్నారు. 'మంచి స్పర్శ - చెడు స్పర్శ' అని ఎంత బోధిస్తున్నా ఫలితాలు పెద్దల రోదనలకు సమాధానం చెప్పలేకపోతున్నాయి.

6 వేల మంది చిట్టిగర్భవతులు

పెరుగుతున్న అత్యాచార కేసులు
బలైపోతున్న బాలికలు
అవగాహన లేక మోసపోతున్నారు

బాలికలు కౌమార దశలో గర్భం దాల్చుతూ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. 15 నుంచి 18 ఏళ్లలోపు వాళ్లు 2023 నుంచి ఇప్పటి వరకూ 6 వేల మంది గర్భం దాల్చారనే గణాంకాలు సమాజాన్ని హెచ్చరిస్తున్నాయి. 2016 నుంచీ గత డిసెంబరు వరకూ మిస్సింగ్ కేసులు పరిశీలిస్తే.. ఉమ్మడి, విభజిత తూర్పుగోదావరిలో బాలలు 21, బాలికలు 70 మంది ఉన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటికే పదుల సంఖ్యలో పోక్సో కేసులు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 12 ఏళ్లలోపు 45, 16 ఏళ్ల లోపు 35, 18 ఏళ్లలోపు బాలికలు 20 మంది తప్పిపోవడం లేదా ఇళ్ల నుంచి వెళ్లిపోవడం జరిగింది. గతేడాది 18ఏళ్ల పైబడిన వారిపై 23, 18 ఏళ్ల లోపు అంటే పిల్లలపై 43 అత్యాచార కేసులు నమోదయ్యాయి.ఈ 43 కేసుల్లో ఓ ఏడు తప్పా. 36 ప్రేమ పేరుతో పరారైనవే కావడం గమనార్హం. ఇక ఆ 23 కేసుల్లో నాలుగు తప్పా మిగతా వాటిలో పెళ్లి చేసుకుంటామని చెప్పినవి ఉన్నాయి. ఈ ఏడాది ఉమ్మడి తూర్పుగోదావరిలో ఇప్పటి వరకూ వందకుపైగా బాలి కలపై అత్యాచారం కేసుల సంఘటనలు ఉన్నాయి.

తల్లిదండ్రుల అప్రమత్తతే శ్రీరామరక్ష

తల్లిదండ్రుల అప్రమత్తత, ప్రవర్తనే పిల్లల పాలిట శ్రీరామరక్ష. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల నిఘా కచ్చితంగా ఉండాలి. తమ పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారు? ఎవ రితో ఎక్కువగా మాట్లాడుతున్నారు? స్కూలు/కాలేజీకి వెళ్లేటప్పుడు విద్యార్థినులేం చేస్తున్నారు? దారి మధ్యలో పెత్తనాలు ఏవైనా చేస్తున్నారా ఇలాంటి విషయాలన్నీ గమనించాలి. హాస్టళ్లలో ఉండే తమ ఆడపిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత వారిదే. హాస్టళ్లలో పరిస్థితులు, తమ చిన్నారి ఎలా ఉంటోంది అనే విషయాలపైనా ఆరా తీయాలి. ముఖ్యంగా తమకు దూరంగా ఉండే పిల్లలతో ప్రేమగా మెలగాలి. వారి మనసులో బాధను తెలుసుకోవాలి. ఏం జరిగినా తమకు చెప్పాలనే భరోసా తల్లిదండ్రులు కల్పించాలి. తాము ఉన్నామనే ధైర్యం ఇవ్వాలి. సాధారణంగా 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ ఉరకలు వేసే వయసు కావడంతో దారితప్పే అవకాశం ఎక్కువ.అందువల్ల తల్లిదండ్రులు గమనిస్తుండాలి. పాఠశాలల్లో టీచర్ల వ్యవహారశైలి.విద్యార్థినులతో ప్రవర్తన గమనించాలి.

అధికారులేం చేస్తున్నారు..

ఇటీవల పోలీస్‌శాఖ, చైల్డ్ వెల్ఫేర్, ప్రొటెక్షన్ సెల్ ఆధ్వర్యంలో పాఠశాలలు,కళాశాలల్లో గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. పోక్సో చట్టం, ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులకు పాల్పడేవారికి విధించే శిక్షలు, అపరిచిత వ్యక్తులతో పాటు చుట్టుపక్కల సమాజంలో ఎలా మెలగాలి అనే విషయాలపైనా న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నారు. లైంగిక వేధింపులు, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే 100కు ఫోన్ చేసి తల్లిదండ్రులు సమాచారం ఇవ్వాలి.. జాప్యం జరిగే పరిస్థితి విషమించే అవకాశం ఉంది.

పిల్లల ప్రవర్తన గమనిస్తుండాలి

పిల్లల ప్రవర్తన తల్లిదండ్రులు గమనిస్తుండాలి.. సెల్‌ఫోన్ ఇస్తే నిఘా ఉండాలి. సోషల్ మీడియా ఎలా ఉపయోగిస్తున్నారనే విషయం పరిశీలించాలి. హెయిర్ కటింగ్, నడవడిక, దుస్తులు వంటివి మంచిగా ఉండేట్లు చూసుకోవాలి. ఆడపిల్లలు ఒకవేళ ఎవరి ట్రాప్‌లో అయినా ఉండి మాట వినకపోతే వెంటనే పోలీసులకు చెప్పాలి. మేం కౌన్సె లింగ్ ఇస్తాం. వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. స్కూలులో పిల్లలకు నైతిక విలువలు, మంచి నడవడిక గురించి నూరి పోస్తుండాలి.అందరం కలిసి ఆడపిల్లలను రక్షిద్దాం.

- డి.నరసింహ కిశోర్, ఎస్పీ, తూర్పుగోదావరి



నైతిక విలువలు పెంచండి

తల్లిదండ్రులు పిల్లల ర్యాంకుల చుట్టూ పరుగులు పెడుతున్నారు. నైతిక విలువలు చెప్పే వారు లేరు. ఆ తరగతి గదులూ మాయమయ్యాయి. ఇవన్నీ కలిసి పిల్లలు నడిచే తీరును వక్రమార్గంలోకి తీసుకెళ తున్నాయి. విద్యా విధానంలో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహభావంతో మెలగాలి. నీతి కథ లు, జీవితంపై చెడు చూపించే ప్రభావం, కుటుంబ విలువలు నూరిపోయాలి.

- డాక్టర్ కర్రి రామారెడ్డి,
ప్రముఖ మానసిక వైద్య నిపుణులు



కొనసాగుతున్న పంటల నష్టాల గణన



ప్రత్తిపాడులో పంటనష్టాల గణనను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌వల్ల జిల్లాలో 19,253 హెక్టార్లలో వరిపంటకు నష్టం జరిగింది. ఇప్పటివరకు 16,419 హెక్టార్లలో వరి పంటకు నష్టం జరిగినట్లు బృందాలు నమోదు చేశాయి. వీటికి రెవెన్యూశాఖ(వీఆర్వో) ఆధ్వర్యంలో ఆమోదించారు. 2,774 హెక్టార్ల వరిపంటను పంటల నష్టాల గణన చేయాల్సిఉంది. 57 హెక్టార్లను నమోదు చేయడానికి వివిధ కారణాలతో తిరస్కరించారు. ఈనెల 4వతేదీకి పంటల నష్టాల గణన పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని కాకినాడ వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ వెల్లడించారు. నష్టపోయిన రైతులకు పరిహారం వస్తుందన్నారు.

పంటను రక్షిద్దాం!

- ఉద్యాన పంటలపై మొంథా తుఫాన్ దెబ్బ
- 669 హెక్టార్లలో వివిధ పంటలకు నష్టం
- రైతులకు సూచనలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు



పిఠాపురంలో ఈదురుగాలుల ధాటికి నేలకూలిన అరటిచెట్లు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి.16 మండలాల పరిధిలో 76 గ్రామాల్లో 669 హెక్టార్లలో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. వాటిలో అరటి 291 హెక్టార్లలో, బొప్పాయి 65.4హెక్టార్లలో, కూరగాయలు 280.2 హెక్టార్లలో, పూలతోటలు 18.7హెక్టార్లలో, తమలపాకులు 1.61 హెక్టార్లలో, దుంపతోటలు 10.8 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు గుర్తించారు.

సంరక్షణ చర్యలు ఇలా...

మొత్తం 1201మంది ఈ తుఫాన్ దెబ్బకు నష్టపోయినట్లు ప్రాథమికంగా ఓ అంచనాకు వచ్చారు. 76బృందాలు జిల్లాలోని ఉద్యాన పంటల నష్టాల లెక్కింపు చేపట్టాయి. ఇప్పటికి 500 హెక్టార్లలో గణన పూర్తి చేసినట్లు జిల్లా ఉద్యాన శాఖాధికారి సిరిల్ తెలిపారు. అదే సమయంలో పంటల సంరక్షణ చర్యలను ఆయన వివరిస్తున్నారు. పొలంలో నీరు నిల్వఉండకుండా నివారించాలి. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పొలాల చుట్టూ ఎత్తయిన కట్టలు లేదా గట్లు నిర్మించాలి. పంట పొలాల నుంచి నీటిని బయటకు పంపేందుకు కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. వర్షాలు ఆగిన వెంటనే యూరియా, పొటాషియం వంటి ఎరువులు వేయాలి. వాతావరణంలో అధిక తేమ వల్ల పంటలకు పురుగులు, తెగుళ్ల సోకే ప్రమాదం ఉంది. వాటి నివారణ చర్యలు సకాలంలో చేపట్టాలి. పురుగుల బెడదను తగ్గించడానికి సస్యరక్షణ మందులను పిచికారీ చేసుకోవాలి. పంట పొలంలో గాలిబాగా ఆడేలా చర్యలు తీసుకోవాలి. అవసరమైతే చెట్లు, లేదా మొక్కల గుబురు ఎక్కువగా ఉంటే వాటిని కత్తిరించాలి.

కూరగాయలు: పొలంలో నిలిచిన నీటిని బయటకు పంపే మార్గం ఏర్పాటు చేసుకోవాలి. 19:19:19/13:0:15/ యూరియా వంటి పోషకాలు చల్లాలి. అవసరమైతే దెబ్బతిని కుళ్లిన కూరగాయలను పూర్తిగా తొలగించాలి. రైతులు పడిపోయిన మొక్కలను నిలబెట్టాలి. ఆకుమచ్చ, కాయకుళ్లు, బూజు తెగుళ్లు ఉంటే లీటరు నీటికి 25 గ్రాములు సాఫ్ మందును కలిపి రెండు సార్లు పిచికారీ చేయాలి. వేరుకుళ్లు వస్తే కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రాములు, కార్బండైజమ్ 10 గ్రాముల చొప్పున 10 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలి.

మిరప పంట: ఈ మొక్కలు వెంటనే తేరుకోవాలంటే లీటరు నీటికి పది గ్రాముల యూరియా, పది గ్రాముల పంచదార కలిపిన ద్రావణాన్ని వారంరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. మొక్కలు తలలు వాలిస్తే లీటరు నీటికి ఐదు గ్రాముల మెగ్నీషియం, సల్ఫేట్, కాపుతో ఉండి ఇనుప ధాతు లోపంతో పాలిపోతే పది లీటర్ల నీటికి 50 గ్రాముల అన్నబేధితో పాటు ఒక నిమ్మ చెక్క రసం కలిపి పిచికారీ చేయాలి. నేల ఆరాక ఎకరానికి 30 కిలోల యూరియా, 15కిలోల పొటాష్, 200 కిలోల వేప పిండి వేయాలి.

అరటి: మూడు నెలల కంటే చిన్నవయస్సున్న మొక్కలు 4-5 రోజులు 2-3 అడుగుల నీటిలో మునిగితే వేరు వ్యవస్థ పూర్తిగా కుళ్లిపోతోంది. నీరు తగ్గిన వెంటనే ఆ మొక్కలు తీసేయాలి. భూమి ఆరాక తేలికపాటి దుక్కి దున్ని సిఫారసు చేసిన దూరంలో పిలకలు మరోసారి నాటుకోవాలి. ఐదారు నెలల వయస్సు, గెలలు వేసే దశలో మొక్కలు దెబ్బతింటే నేల ఆరాక అంతర సేద్యం చేయాలి. మొక్కకు వంద గ్రాముల యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 20-25 రోజుల వ్యవధిలో రెండు, మూడు దఫాలు చల్లుకోవాలి. దుంపలు కుళ్లిపోకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్క చుట్టూ తడిసేలా చల్లాలి.

బొప్పాయి: కొత్తగా మొక్కలు నాటిన చోట్ల అవి పసుపు రంగులోకి మారతాయి. కాండం కుళ్ల తెగులు లక్షణాలు కనిపిస్తే రెడోమిల్ రెండు గ్రాములు/ఎలైట్ రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి మొదళ్ల తడిసేలా చల్లాలి. కాయ కోత దశలో పండు ఈగ ఉధృతి అధికమవుతోంది. ఇటువంటి చోట్ల మిథైల్ యుజనాల్ ఎరలు ఎకరానికి 10-15 ఏర్పాటు చేసుకోవాలి.

పూలతోటలు: మొక్కలపై రెండు శాతం యూరియా/ఒక శాతం 13-0-45(నీటిలో కరిగే ఎరువు మల్టీ-కె)ను 2-3 సార్లు పిచికారీ చేయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో 1-2 సార్లు పిచికారీ చేయాలి.

కొబ్బరి: ఐదేళ్లలోపు మొక్కలు వారం కంటే ఎక్కువ రోజులు నీటిలో ఉంటే ఆకులు పసుపుగా మారి, ఎదుగుదల తగ్గి మొవ్వు కుళ్ల వచ్చే అవకాశాలు ఉన్నాయి. తోటలు సాధారణ స్థితికి వచ్చిన వెంటనే 500 గ్రాముల యూరియా, కిలో ఎస్‌ఎస్‌పీ, 1.5 కిలోల ఎంవోపీ చొప్పున అందించాలి.



కర్రపెండలం దుంప పంటకు తీరని నష్టం

సామర్లకోట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జిల్లాలోని మెట్టప్రాంతాల్లో మాత్రమే సాగవుతున్న కర్రపెండలం దుంప పంటలకు మొంథా తుఫాన్ కారణంగా వీచిన ఈదురుగాలులు, కురిసిన భారీవర్షాల తీరని నష్టం వాటిల్లింది. దుంప మొక్క వేరు వ్యవస్థ పూర్తిగా కదిలిపోయి దుంప గుత్తులు నేలపైకి వచ్చాయి. దీంతో ఎకరాకు 10పుట్లు మేర(పుట్టి-225 కిలోలు) రూ.20-25వేల వరకు నష్టం వాటిల్లే అవకాశాలున్నాయని రైతులు వాపోతున్నారు. జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో ఈ ఏడాది 15వేల ఎకరాల్లో కర్రపెండలం సాగు చేసినట్లు శాగో మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. రైతుల ఆవేదనను శాగో అసోసియేషన్ ప్రతినిధులు పరిశీలించారన్నారు. రూ.20-30కోట్ల మేర పంటనష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలుస్తోంది. వ్యవసాయశాఖ రికార్డుల్లో ఉద్యానపంటగా ఉన్న కర్ర పెండలానికి గతంలో ఎన్నడూ ప్రభుత్వంనుంచి బీమా సాయం అందించలేదు. దీంతో ఈ పంట సాగు చేసే కౌలురైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల ఊబిలోకి దిగాల్సిన వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తుఫాన్ కారణంగా జరిగిన నష్టాన్ని గుర్తించి పరిహారమివ్వాలని కోరుతున్నారు.

శవాలపై కాసుల వేట!

పెద్దాసుపత్రిలో పెద్ద దందా



- అందని అత్యవసర సేవలు
- ప్రైవేటు అంబులెన్స్‌ల దందా
- కనిపించని మహాప్రస్థానం వాహనాలు

జీజీహెచ్(కాకినాడ) నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అత్యవసర సేవ పేదలకు అందుబాటులోకి రావడంలేదు.. ప్రభుత్వం సౌకర్యం కల్పించినా మామూళ్ల మత్తులో జోగుతున్న సిబ్బంది పేదల దరి చేరనీయడంలేదు. దీంతో పేదల జేబు గుల్లవుతోంది. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన పేద, సామాన్య ప్రజల సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం 7 మహాప్రస్థానం వాహనాలను మనుగడలోకి తెచ్చింది. ఇవి ఆయా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మృతదేహాలను జిల్లావ్యాప్తంగా ఏ మారుమూల ప్రాంతానికైనా ఉచితంగా చేర్చాలి. ఈ అవకాశాన్ని పేదలకు అందుబాటులోకి రానీయకుండా ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకులు రాబందుల్లా లాక్కుపోతున్నారు. అయినా అధికారులు చూస్తూ ఊరుకోవడం తప్ప ఏం చేయడంలేదు.

జీజీహెచ్‌లో ఇది పరిస్థితి

కాకినాడ జీజీహెచ్‌కు ప్రతిరోజూ 3వేల నుంచి 4వేల మంది వస్తుంటారు. పలు విభాగాల్లో 2వేలమందికిపైగా చికిత్సపొందుతుంటారు. ఈ క్రమంలో రోజూ పరిస్థితి విషమించి 20మంది వరకు మరణిస్తుంటారు. వీరు వివిధ ప్రాంతాలకు చెందిన వారై ఉంటారు. గతంలో మృతదేహాలను ప్రైవేటు అంబులెన్స్‌ల ద్వారా వారి గమ్యస్థానాలకు చేర్చాలంటే రూ.వేలల్లో ఖర్చయ్యేది. అప్పుడు మృతుల బంధువులు తప్పని పరిస్థితుల్లో అప్పులు చేసి మృతదేహాలను స్వస్థలాలకు తరలించేవారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మహాప్రస్థానం అంబులెన్స్ ఉచితసేవలను అన్ని ప్రభుత్వ బోధనాసుపత్రులకు అందుబాటులోకి తెచ్చింది. జీజీహెచ్‌లో 7 మహాప్రస్థానం అంబులెన్స్‌లు ఉంటాయి. వాటిలో పగటిపూట 5, రాత్రిపూట 2 విధుల్లో ఉంటాయి. ఈ ఏడు వాహనాలకు ఏడుగురు రెగ్యులర్ డ్రైవర్లతో పాటు మరొక ఆప్షనల్ డ్రైవర్ విధులు నిర్వర్తిస్తుంటారు. కొంతమంది వార్డుల్లో పనిచేసే సిబ్బంది మృతదేహాలను వార్డులో నుంచి అంబులెన్స్ వరకు తీసుకొచ్చే క్రమంలో మృతుల కుటుంబీకులతో మహాప్రస్థానం డ్రైవర్ అందుబాటులో లేడని, అయినా ఆ వాహనాలు మృతదేహాన్ని స్వస్థలం వరకు చేర్చవని నమ్మించి ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకులతో లోపాయికారీ ఒప్పందం చేసుకుని వేలల్లో వసూళ్ల చేస్తున్నారు. వార్డు సిబ్బందికి సగం, అంబులెన్స్ నిర్వాహకుడికి సగం వసూళ్ల దందా చేస్తున్నారు. మహాప్రస్థానం డ్రైవర్లు అందుబాటులో ఉన్నా ఈ దందా సాగుతోంది. వాస్తవంగా వార్డులో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన తర్వాత అక్కడ సిబ్బంది మహాప్రస్థానం డ్రైవర్‌కు తెలియజేయాలి. కానీ, ఇక్కడ ఆ పరిస్థితులు లేదు. రాత్రయితే ప్రైవేటు అంబులెన్స్‌ల యాజమాన్యం జీజీహెచ్‌లో తిష్ఠ వేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి దందా అరికట్టాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.



నయనానందకరం.. నౌకావిహారం

● పంపా సరోవరంలో ఘనంగా సత్యదేవుడి తెప్పోత్సవం ● తరించిన భక్తజనం

తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, భక్తులు







స్వామి,అమ్మవార్లను తీసుకొచ్చి హారతి ఇస్తున్న పండితులు, నృత్య ప్రదర్శన

అన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న రత్నగిరివాసుడైన సత్యదేవుడి నౌకావిహారం ఆదివారం భక్తజనుల గోవిందనామస్మరణల నడుమ నయనానందకరంగా జరిగింది. అనంతలక్ష్మి సమేతుడైన స్వామి పచ్చనికొండల నడుమ పంపా హోయలలో హంసవాహనంపై ముమ్మారు విహరించగా ప్రకృతి పరవశించింది. విద్యుద్దీపఅలంకరణలు, కళ్లు మిరుమిట్లు గొలిపే బాణాసంచా కాల్పుల నడుమ ఆహ్లాదభరిత వాతావరణంలో ఈ కమనీయ వేడుక ఘనంగా జరిగింది. సాయంత్రం 5గంటలకు కొండపై నుంచి స్వామి,అమ్మవార్లను.. క్షేత్రపాలకులైన సీతారాములను పల్లకీలో ఘాట్‌రోడ్డు గుండా బాజాభజంత్రీలు, వేదమంత్రాల నడుమ పంపాసరోవర తీరంవద్దకు తోడ్కొనివచ్చారు. వివిధ సుగంధ భరిత పుష్పమాలికలతో తీర్చిదిద్దిన ప్రత్యేక వేదికపై సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను, మరో వేదికపై సీతారాములను ఆశీనులు గావించి పండితులు వేదస్వస్తితో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు చామర్తి వెంకటరెడ్డి పంతులు, పాలంకి పట్టాభి తదితరులు గణపతిపూజ, పుణ్యాహవచనం శ్రీసూక్త, పురుషసూక్త విధానంలో కృతువు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక వద్ద అర్చకస్వాములు తులసిధాత్రి పూజను జరిపించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి,అమ్మవార్లను పంపాతీరం వద్ద ప్రత్యేకంగా తయారుచేయించిన హంస వాహనంపైకి తీసువెళ్లి మరోమారు పూజలు అనంతరం 3పర్యాయాలు పంపా సరోవరంలో నౌకావిహారం గావించారు. అనంతరం చతుర్వేదపండితులు మహాదాశీర్వచనం అందజేయగా భక్తులకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు.

ఆనవాయితీగా వేడుక...

ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు పాలకడలిలో శయనించి భాద్రపద ఏకాదశి (పరివర్తన ఏకాదశి) రోజున ఒకపక్కకు ఒదిగుతారు కార్తీకమాసంలో వచ్చే క్షీరాబ్దిద్వాదశి రోజున శ్రీ మహావిష్ణువు మేల్కొనడానికి ప్రతీకగా విష్ణుస్వరూపుడైన సత్యదేవుడికి ఈ వేడుకను జరపడం ఆనవాయితీగా వస్తుంది.

ప్రత్యేక ఏర్పాట్లు

సాధారణ భక్తులు తిలకించేందుకు ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటుచేయగా ప్రముఖులు నౌకావిహారం చూసేందుకు తీరం వద్ద ప్రత్యేక గ్యాలరీ, భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టగా పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆదేశాలతో ప్రత్తిపాడు సీఐ, అన్నవరం ఎస్‌ఐ బందోబస్తు నిర్వహించారు. ప్రవాహం ఎక్కువగా ఉండడంతో హంస వాహనంపైకి ముందుగా అనుకున్న 18 మంది వైదికబృందాన్ని 12 మందికి కుదించారు. ముందుజాగ్రత్త చర్యగా పంపా సరోవరంలో హంస వాహనం తిరిగే దూరాన్ని తగ్గించారు.

సత్యదేవుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు



సత్యదేవుడి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

6200 జంటలు సత్యవ్రతాలు

రూ.65 లక్షల ఆదాయం

అన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో కార్తీకమాస రద్దీ ఆదివారం కొనసాగింది. సెలవుదినం, క్షీరాబ్దిద్వాదశి పర్వదినం కావడంతో అశేషసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒం టిగంట నుంచి వ్రతాలు, 2గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. ఉదయం 9 గంటలవరకు సాధారణంగా ఉన్న భక్తజనం 9 దాటిన తరువాత పోటెత్తారు. భక్తులకు ఎటువంటి అ సౌకర్యం కలగకుండా చైర్మన్ ఐవీ రోహిత్ పశ్చిమరాజగోపురం లిఫ్ట్ వద్ద, ఈవో వీర్ల సుబ్బారావు కమాండ్ కంట్రోల్ రూంలో ఉండి పర్యవేక్షించారు. రద్దీ ఆధారంగా అంత్రాలయ దర్శనానికి అనుమతించారు. స్వామివారి ప్రత్యేకదర్శనానికి 2గంటలు, ఉచిత దర్శనానికి 3గంటల సమయం భక్తులు వేచిఉన్నారు. ఆదివారం 6200 జంటలు వ్రతాలాచరించుకోగా వివిధ విభాగాల ద్వా రా సుమారు రూ.65 లక్షల ఆదాయం లభించింది. కార్తీక సోమవారం భక్తుల రద్దీకణుగుణంగా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఘనంగా సత్యజ్యోతి ఊరేగింపు

క్షీరాబ్దిద్వాదశి పర్వదినం పురస్కరించుకుని ఆదివారం ఉదయం సత్యజ్యోతి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్లను గ్రామశివారున ఉన్న సుబ్బరాయపురం సాక్షిగణపతి ఆలయం వద్దకు తీసుకుని వెళ్లి ప్రత్యేక పూజలు అనంతరం అక్కడ వెలిగించిన సత్యజ్యోతిని గ్రామంలో సత్యదీక్షాపరులు, అయ్యప్పమాలధారులతో గోవిందనామస్మరణల నడుమ ఊరేగింపు నిర్వహించి కొండపై కళామందిరంలో సత్యజ్యోతిని భక్తుల కోసం ఉంచారు.



సత్యజ్యోతి ఊరేగింపు నిర్వహిస్తున్న ఈవో, అర్చకులు

'లోవ'లో భక్తుల కోలాహలం

ఆలయానికి రూ.1.48 లక్షల ఆదాయం



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు



క్యూలో బారులు తీరిన భక్తులు


తుని రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ప్రత్యేక క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లో గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబసమేతంగా భోజనాలు చే శారు. ఆలయానికి రూ. 1.48 లక్షల ఆదాయం వచ్చినట్టు ఈవో విశ్వనాధ్ రాజు తెలిపారు.

వైభవంగా క్షీరాబ్ధి ద్వాదశి వేడుకలు

గోదావరిలో విహరించిన వాడపల్లి వెంకన్న

ఆత్రేయపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక ఆదివారం క్షీరాబ్ధి ద్వాదశి (చిలుకు ద్వాదశి) వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పల్లకీలో ఆధి రోహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి మేళతాళ మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి గౌతమి గోదావరి నదీలో హంస వాహనంలో కొలువుతీరిన స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష అర్చన, చతుర్వేద స్వస్తి అర్చక బృందం ఘనంగా నిర్వహించారు. శ్రీవారి హంస వాహనంలో గోదావరిలో మిరుగొట్లు గొలిపే విద్యుత్ కాంతుల నడుమ వేదమంత్రాల సాక్షిగా విహరించారు. అశేష భక్తజనం పాల్గొని తన్మయత్వం పొందారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పాల్గొన్నారు.





వాడపల్లిలో గౌతమి గోదావరిలో హంస వాహనంపై విహరిస్తున్న శ్రీవారు, పూజలు చేస్తున్న అర్చకులు

అంతర్వేదిలో తెప్పోత్సవం

అంతర్వేది, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసంహస్వామి వారి ఆలయంలో ద్వాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం కంచుగరుడ వాహనంపై స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి-అమ్మవార్లను ఊరేగింపుగా బాణసంచా కాల్పులు, కేరళ వాయిద్యాల నడుమ పల్లిపాలెం గ్రామంలోకి శాస్త్రోక్తంగా తీసుకెళ్లారు. వశిష్ట రేవులో తెప్పోత్సవం వైభవంగా జరిగింది. అంతర్వేది పల్లిపాలెం వశిష్ట రేవులో ప్రారంభమైన తెప్పోత్సవం గొంది గ్రామానికి చేరుకుని తిరుగు ప్రయాణంలో రాత్రి అంతర్వేదికి చేరుకుంది. అనంతరం ద్వాదశ మండపానికి చేరుకున్న స్వామి,అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొన్నారు.



అంతర్వేది వశిష్ట రేవులో హంస వాహనంపై స్వామివారికి తెప్పోత్సవం





పిఠాపురం-గొల్లప్రోలు మధ్య ఏలేరు కాలువకు పడిన గండ్ల నుంచి వరద ప్రవాహం, ముంపులో వరి చేను

తగ్గుతున్న 'ఏలేరు' వరద

» అవుట్‌ఫ్లోస్ 3,175 క్యూసెక్కులు

» ఇంకా ముంపులోనే పంట పొలాలు



ఏలేరు జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

పిఠాపురం/ ఏలేశ్వరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏలేరు వరద ఉధృతి తగ్గుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి రిజర్వాయర్‌లోకి వస్తున్న ఇన్‌ఫ్లోస్ తగ్గడంతో ఆ మేరకు అవుట్‌ఫ్లోస్‌ను తగ్గించారు. అయితే పంట పొలాల్లో మాత్రం వరద నీరు కొనసాగుతోంది. నీరు తగ్గేందుకు మరో రెండు, మూడు రోజులు పడుతుందని రైతులు చెప్తున్నారు.

ఏలేరు రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు తగ్గడంతో దిగువకు వరద జలాల విడుదలను 3,175 క్యూసెక్కులకు పరిమితం చేశారు. దీంతో ఆదివారం సాయంత్రం వరద ఉధృతి తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. శనివారం వరకు 6,175 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లోస్ ఆదివారం ఉదయం 6 గంటలకు 4,806 క్యూసెక్కులకు తగ్గగా, 9 గంటలకు 3,145 క్యూసెక్కులు, 11 గంటలకు 2,935 క్యూసెక్కులు, సాయంత్రం 4 గంటలకు 1,687 క్యూసెక్కులు, 6 గంటలకు 1,784 క్యూసెక్కులుగా ఉన్నాయి. ఆదివారం ఉదయం 6 గంటలకు 6,175 క్యూసెక్కులుగా ఉన్న అవుట్‌ఫ్లోస్‌ను సాయంత్రానికి 3,175 క్యూసెక్కులకు తగ్గించారు. స్పిల్‌వే ద్వారా 2,400, డీసీఆర్ స్లూయిస్ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని కాలువలకు విడుదల చేస్తుండగా, విశాఖ అవసరాలకు 1750 క్యూసెక్కులు పంపుతున్నారు. ఏలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం 85.63 మీటర్లు ఉండగా, నీటి నిల్వలు 22.22 టీఎంసీలు ఉన్నాయి.

ఏలేరు రిజర్వాయర్ నుంచి విడుదల చేసున్న నీటి ప్రవాహం పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లో ఉధృతంగానే ఉంది. కాలువలకు పలుచోట్ల గండ్లు పడడంతో వాటి నుంచి వస్తున్న వరద నీరు పంట పొలాల్లోకి చేరుతోంది. ఫలితంగా వరి చేలల్లో నీరు ఇంకా అలాగే ఉంది. పూర్తిస్థాయిలో తగ్గేందుకు మూడు రోజుల సమయం పడుతుందని రైతులు తెలిపారు. వరద ఉధృతికి కాలువలు పలుచోట్ల కోతకు గురికావడంతో పాటు గండ్లు పెద్దవిగా మారుతున్నాయి. వీటిని తక్షణం పూడ్చేందుకు చర్యలు చేపట్టకపోతే ముంపు తగ్గదని చెప్తున్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పోలీసులు

కాకినాడ క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ మహిళా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక ఎస్‌ఐ, మరో కానిస్టేబుల్ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. కాకినాడ డైరీఫారం సెంటర్‌కు చెందిన ఓ మహిళ వైవాహిక జీవితంలో చోటుచేసుకున్న వివాదాలతో తన భర్తపై గత నెల 13న గ్రీవెన్స్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఎస్పీ దర్యాప్తు చేపట్టి బాధితురాలికి న్యాయం చేయాలని మహిళా పోలీసులకు సిఫార్సు చేశారు. కేసు విచారణను ఎస్‌ఐ వాడపల్లి ఆంజనేయరాజు చేపట్టారు. ఈ క్రమంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న భర్తకు అండగా నిలిచాడు. కేసు విచారణ తాను చూసుకుంటానని భరోసా ఇచ్చి అతడి నుంచి రూ.20వేలు లంచం వసూలు చేశాడు. ఈ మొత్తాన్ని అక్కడే పనిచేస్తున్న కానిస్టేబుల్ జుత్తుక శ్రీనివాసరావు అందుకుని ఎస్‌ఐకు అందజేశాడు. ఈ ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాన్ని బాధితురాలు ప్రత్యక్షంగా చూసింది. అనంతరం ఆమె ఎస్పీని ఆశ్రయించి జరిగిన విషయాన్ని ఫిర్యాదు రూపంలో ఇచ్చింది. ఈ వ్యవహారంపై ఎస్పీ అంతర్గత విచారణ చేపట్టారు. వాస్తవాలు నిగ్గుతేలడంతో ఎస్‌ఐ, కానిస్టేబుల్‌లను బదిలీ చేసేందుకు సిద్ధమయ్యారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



మృతుడు షేక్ ఇమామ్ (పాత చిత్రం)

దేవరపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెనుక నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొనడంతో మోటారు సైకిస్టు దుర్మరణం చెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం రంగరాయ కాలనీకి చెందిన షేక్ ఇమామ్ (50) రాళ్లు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పనిమీద బైక్‌పై బయల్దేరాడు. ఏలూరు నుంచి కొవ్వూరు వైపు వెళ్తున్న అతడిని మండలంలోని దుద్దుకూరు సమీపంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా నిర్లక్ష్యంగా వచ్చిన వ్యాన్ ఢీకొంది. కిందపడిన ఇమామ్ తల డివైడర్‌కు తగలడంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే కన్నుమూశాడు. అతడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం చెప్పారు.

రంగంలోకి నాలుగు ప్రత్యేక బృందాలు

కొంకాపల్లికి చెందిన శ్రీను హత్య కేసులో నిందితుల కోసం విస్తృత గాలింపు

పోలీసుల అదుపులో నలుగురు ప్రధాన నిందితులు: సోషల్ మీడియాలో ప్రచారం

అమలాపురం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ (37) హత్య కేసును ఛేధించేందుకు ఎస్పీ రాహుల్‌మీనా పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించారు. శ్రీనివాస్‌ను అతి కిరాతకంగా హత్య చేసిన అనంతరం ప్రధాన నిందితులు అదే రోజున దేశంలోని వివిధ ప్రధాన ప్రాంతాలకు వెళ్లిపోయినట్టు పోలీసులు గుర్తించారు. తమిళనాడు, ఉత్తరప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో కీలక ప్రాంతాల్లో ఉన్న నలుగురు ప్రధాన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అయితే తాము ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని పోలీసులు చెప్తున్నారు. శ్రీనివాస్ హత్య అనంతర పరిణామాలపై పట్టణ పోలీసులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అయితే ఈ కేసులో ప్రధాన నిందితులు పోలీసుల అదుపులోకి చేరినట్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. స్వామిమాలలో ఉన్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదివారం మృతుడు శ్రీనివాస్ భార్య దేవితో ఫోనులో మాట్లాడి ధైర్యం చెప్పారు. హత్యకు కారకులైన వారిని అరెస్టు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇదిలా ఉండగా పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లి గోదావరిలో లభ్యమైన శ్రీనివాస్ మృతదేహానికి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. నివేదిక ఇంతవరకు అందలేదని, దాని ఆధారంగా కేసులో దర్యాప్తును కీలకంగా మార్చుకునే అవకాశం ఉంటుందని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

ఈలకొలనులో వ్యక్తిపై హత్యాయత్నం: ఐదుగురి అరెస్టు

రంగంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం ఈలకొలనులో ఒక వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో ఐదుగురిని అరెస్టు చేశారు. రంగంపేట ఎస్‌ఐ ఎస్.శివప్రసాద్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం... రంగంపేట మండలం ఈలకొలనుకు చెందిన నులుకుర్తి వీరలక్ష్మి తన పేరిట వున్న సుమారు 9 ఎకరాల పామాయిల్ తోటను కాకినాడ జిల్లా కరప మండలం వేళంగికి చెందిన తన తండ్రి టేకుమూడి వీర వెంకట సత్యనారాయణకు ఈ ఏడాది ఆగస్టులో రిజిస్ట్రేషన్ చేయించింది. ఈ నెల ఒకటో తేదీన ఆయన కొంతమంది పనివాళ్లను, మనుమడిని తీసుకుని పామాయిల్ తోటలోకి వెళ్లి గెలులు కోయించాడు. వాటిని ట్రాక్టర్లోకి ఎక్కిస్తుండగా రాజానగరం మండలం సూర్యారావుపేటకు చెందిన దొండపాటి దుర్గ, కొవ్వూరి సత్యనారాయణ, కొవ్వూరి బాబి, యాళ్ల రామారావు, రాధేయపాలేనికి చెందిన మేడిశెట్టి నరసింహమూర్తి అడ్డుకున్నారు. ఈ తోట నులుకుర్తి ముత్యమాధురి, సాల్మన్‌రాజులకి చెందినదని, ఇందులో మీరు ఎందుకు గెలలు కోస్తున్నారని పై ఐదుగురు ప్రశ్నించారు. గెలలు కోయడానికి ఎవరైనా వస్తే వారి అంతు చూడాలని తమతో చెప్పారన్నారు. ముందుగా తెచ్చుకున్న కర్రలతో టేకుమూడి సత్యనారా యణను చంపేందుకు ప్రయత్నిస్తుండగా ఆయన మనువడు, స్నేహితులు అడ్డుకోవడంతో తృటిలో తప్పించుకున్నారు. మూడు నెలల క్రితం పై వ్యక్తులు వేళంగిలోని తన ఇంటికి వచ్చి తనను, తన కుమార్తెను చంపేస్తామని బెదిరించారన్నారు. శనివారం హత్యాప్రయత్నం చేశారని రంగంపేట పోలీస్ స్టేషన్లో బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దొండపాటి దుర్గ, కొవ్వూరి సత్యనారాయణ, కొవ్వూరి బాబి, మేడిశెట్టి నరసింహమూర్తి, యాళ్ల రామారావులను అరెస్టు చేశారు. మిగిలిన వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని ఎస్‌ఐ చెప్పారు.

సహచరుడి మరణం కలచివేసింది

రాష్ట్ర స్థాయి అవార్డును నిరాకరించిన విద్యుత్ శాఖ ఏఈ ప్రసాద్



అంతర్వేది/మలికిపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మండలం సఖినేటిపల్లి మండలంలో వందలాది విద్యుత్ స్తంభాలు విరిగిపడి వాటిపై కొబ్బరిచెట్లు పడిపోయాయి. వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించి 24 గంటల్లోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. తుఫాన్ సహాయ చర్యల్లో కష్టపడిన విద్యుత్ శాఖ సఖినేటిపల్లి, మలికిపురం మండలాల ఏఈ బొలిశెట్టి ప్రసాద్‌ను రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక చేశారు. ముఖ్యమంత్రి నుంచి అవార్డు తీసుకునేందుకు ఆయన అమరావతి వెళ్లలేదు. దీనిపై ఏఈని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో తన పర్యవేక్షణలో పనిచేసిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్ యడ్ల శంకర్ ప్రమాదవశాత్తు మృతి చెందడం తనను కలచివేసిందని, తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయన్నారు. అతడి కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్నప్పుడు అవార్డు తీసుకునేందుకు తన మనసు అంగీకరించలేదని ఏఈ చెప్పారు.



మత్స్యకారులకు చిక్కిన చేపలు

సూర చేపలివిగో...

ఉప్పాడ తీరంలో రూ.70 లక్షలు విలువైన మత్స్య సంపద లభ్యం

కొత్తపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో మత్స్యకారులకు సూర చేపలు లభ్యమయ్యాయి. ఇటీవల వరుస తుఫాన్లతో వారు ఇళ్లకే పరిమితమయ్యారు. మొంథా తుఫాన్ అనంతరం ఆదివారం వేటకు వెళ్లిన వారికి రూ.70 లక్షలు విలువైన సూర చేపలు దొరికాయి. దీంతో ఆనందం వ్యక్తం చేశారు.

ఎవరీ యువతి!

ముమ్మిడివరం పరిసరాల్లో సంచారం



ముమ్మిడివరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిసర ప్రాంతాల్లో గుర్తు తెలియని యువతి సంచరిస్తోంది. ఆమెకు మతిస్థిమితం లేదని స్థానికులు చెప్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్ల వెంబడి తిరుగుతోందని, గుర్తిస్తే సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయాలని కోరుతున్నారు. అసలే పరిస్థితులు బాగోలేని దృష్ట్యా ఒంటరిగా తిరుగుతున్న యువతిని కాపాడేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం



పెద్దాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ దేవస్థానంలో సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. సుమారు 300 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. దాతల విరాళంతో త్వరలో నిత్యాన్నదానం చేపడతామని ఆమె చెప్పారు. సిబ్బంది రమణ, క్రాంతివీర్ పాల్గొన్నారు.



పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు



సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో లక్ష పత్రి పూజలో పాల్గొన్న భక్తులు

ఘనంగా క్షీరాబ్ది ద్వాదశి

పిఠాపురం, సామర్లకోట ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు

పిఠాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో క్షీరాబ్ది (కైశిక) ద్వాదశి పూజలు ఘనంగా జరిగాయి. ఆదివారంతో పాటు కార్తీక మాసంలో పవిత్రమైన రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పుష్కరిణిలో స్నానాలు ఆచరించి కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. కుక్కుటేశునికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవార్లకు కుంకుమార్చన జరిగాయి. ఇళ్ల వద్ద పూజలు చేసుకున్న భక్తులు రాత్రి ఆలయానికి వచ్చి దీపాలు వెలిగించారు. ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో ఈవో బళ్ల నీల కంఠం ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు), సభ్యుల పర్యవేక్షణలో తెల్లవారుజామున భీమేశ్వర స్వామికి గోపూజ జరిపారు. భీమేశ్వరస్వామి వారికి విశేష అభిషేకాలు, బాలాత్రిపురసుందరి అమ్మ వారికి పుష్పార్చన నిర్వహించారు. మధ్యాహ్నం జరిగిన లక్ష పత్రి పూజలో కాకినాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ముసుము వెంకట రాంబాబు కుటుంబ సభ్యులు ఆశీనులయ్యారు. సాయంత్రం ధ్వజ స్తంభం వద్ద ఆకాశదీప పూజలు జరిపారు. రాత్రి ఆలయ ఆవరణలో దీపారాధన సంఘం సభ్యులు జ్యోతిర్లింగార్చన చేశారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కట్టమూరు, తిరుపతి దేవాలయాల్లో స్వామవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దేవదేవుడిని దర్శించుకుని పూజలు చేశారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పిఠాపురం నియోజకవర్గ విద్యార్థినులు

రాష్ట్రస్థాయి పోటీలకు ముగ్గురి ఎంపిక

పిఠాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పిఠాపురం నియోజకవర్గ స్థాయిలో 8 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పిఠాపురం మండల వనరుల కేంద్రంలో వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలు నిర్వహించారు. కొత్తపల్లి మండలం నాగులాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.మానస, గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన కె.అమూల్య, గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన కె.భవ్యశ్రీ విజేతలుగా నిలిచారు. వీరు అమరావతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవోలు జి.శ్యాంబాబు, కేటీ నారాయణదాసు తెలిపారు.



నేటి నుంచి గోపాల్‌బాబా ఆరాధనా మహోత్సవాలు

పిఠాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల గోపాల్ బాబా ఆశ్రమ ప్రాంగణంలో సద్గురు గోపాల్‌బాబా నవమ దివ్య ఆరాధనా మహోత్సవాలు సోమవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు జరుగుతాయి. 3న అఖండ జ్యోతిప్రజ్వలన, విఘ్నేశ్వర పూజ, అగ్నిమథనం, 4న ప్రాతఃకాల అర్చన, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, విశేష పుష్పార్చన, మన్యుపాశుపత హోమం, 5న నామసంకీర్తన, విష్ణుసహస్రనామ హోమం, 6న బిల్వ పుష్పార్చన, సాయంత్రం సద్గురు, శ్రీపాదశ్రీవల్లభ, దత్తాత్రేయ హోమాలు, 7న కుంకుమ, పుష్పార్చన, కనకధారా స్తోత్రం, లలితాసహస్ర స్తోత్ర నామ హోమం, 8న తులసిపత్ర పూజ, నవగ్రహ పాశుపత హోమం, 9న సౌర హోమం, సాయంత్రం పుత్రకామేష్టి హోమం, 10న పాదుకాపూజ, మహాపూర్ణాహుతి, సాయంత్రం అఖండ దీపోత్సవం జరుగుతాయి. భక్తులు హాజరై ఈ కార్యక్రమాలను వీక్షించాలని ఆశ్రమ కమిటీ ప్రతినిధులు కోరారు.



గైగోలుపాడులో జరిగిన శెట్టిబలిజ కార్తీక వనసమారాధనలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

శెట్టిబలిజల అభ్యున్నతికి కృషి: మంత్రి సుభాష్

సర్పవరం జంక్షన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి స్ఫూర్తితో ముందుకెళ్లి సంఘ అభ్యున్నతికి పార్టీలకతీతంగా కృషి చేద్దామని మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గైగోలుపాడులో ఆదివారం నిర్వహించిన కార్తీక వనసమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం పటిష్టత, రాజ్యాధికారం సాధన దిశగా పోరాటం చేయాలని పలువురు కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు చొల్లంగి వేణుగోపాల్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పిల్లి సత్యనారాయణమూర్తి, నులుకుర్తి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాసబాబా, వాసంశెట్టి అంజిబాబు, పలివెల త్రిమూర్తులు, శీలం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





ఫైనల్ మ్యాచ్‌ను సామర్లకోటలో వీక్షిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, కాకినాడలోని లావణ్య నర్సింగ్ కాలేజీలో చూస్తున్న విద్యార్థినులు

బిగ్ స్ర్కీన్‌లపై మహిళల వన్డే క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్

కలెక్టరేట్ (కాకినాడ)/కాకినాడ సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళల క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు విజయం సాధించాలని కోరుతూ కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మల్లిపూడి వీరు, రహీం, అంబటి చిన్న, గుమ్మళ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. ఎండీ ఖాన్, ఎండీ అన్సర్, బుల్లోజు ఉమామహేశ్వరరావు, అశ్రిఫ్ అలీ, ఖాదర్‌వలీఖాన్, రాజబాబు, షేక్ అన్వర్, పోలిపల్లి జగన్ పాల్గొన్నారు. మహిళల క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షిం చేం దుకు ఎమ్మెల్యే కొండబాబు ఆధ్వర్యంలో భానుగుడి సెంటర్లో ప్రత్యేక స్ర్కీన్లు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో అభిమానులు వచ్చి వీక్షించారు. వారి కేరింతలతో అక్కడ సందడి నెలకొంది.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఆదివారం జరిగిన మెగా ఫైనల్‌ను వీక్షించేందుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఈస్ట్ గోదావరి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో కాకినాడలోని లావణ్య నర్సింగ్ కాలేజీలో స్ర్కీన్ ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది విద్యార్థినులు మ్యాచ్‌ను తిలకించారు. ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ నక్కా వెంకటేష్, కోశాధికారి జి.అప్పారావు, కోచ్‌లు ఇజ్రాయిల్ రాజు, చార్లీ, సభ్యులు, మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాతో జరిగిన తుది పోరులో భారత మహిళా క్రికెట్ జట్టు విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన భారీ ఎల్‌ఈడీ స్ర్కీన్‌ను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, చిన్నారులు, యువకులు, క్రీడాకారులతో కలిసి వీక్షించారు. డబుల్ సెవెన్ రాజు, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు శ్రీనివాసు, ఎండీ సైపుల్లా, గొలితి సత్యనారాయణ, చుండ్రు బలరాం, కంచర్ల సుష్మామోహిని, బొందల రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా భారత మహిళా క్రికెట్ జట్టు విజయం కోరుతూ పట్టణంలోని మెహెర్ కాంప్లెక్స్ వద్ద గల గణపతి ఆలయంలో టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్ (బాబు), బలుసు శ్రీనివాసు, మురెడ్డి శ్రీరాములు, వాడపర్తి వీరభద్రరావు, బాడితమాని త్రిమూర్తులు, వల్లూరి దొరబాబు తదితరులు పాల్గొన్నారు. కొప్పవరంలోని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక ఎల్‌ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేశారు. భారత్ మహిళా క్రికెట్ జట్టు విజయం సాధించాలని ఎంపీ ఆకాంక్షించారు. జై భారత్, గో ఇండియా, గో ఇండియా అంటూ క్రికెట్ అభిమానులు నినాదాలు చేశారు.



మత్స్యకారులకు రేషన్ కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీ పద్మశ్రీ

'తుఫాన్ బాధితులకు ప్రభుత్వ అండ'

సర్పవరం జంక్షన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న హార్బర్‌పేటకు చెందిన 851 మత్స్యకార కుటుంబాలకు ఆదివారం 50 కిలోల బియ్యం, నిత్యావసరాలను ఆయన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, కూటమి నాయకులు పెంకే శ్రీనివాసబాబా, కరెడ్ల గోవిందు, రంబాల వెంకటేశ్వరరావు, పుల్ల శ్రీరాములు, సీతయ్యదొర, సోదె మునలయ్య, గంటా ప్రసాద్, ఎంపీడీవో పసుపులేటి సతీష్, గ్రామ కార్యదర్శి పిడుగు పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో వనసమారాధనకు హాజరైన యాదవులు

సందడిగా యాదవ కార్తీక వనసమారాధన

పిఠాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): యాదవులంతా ఐక్యతతో ఉండి రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో ఎదగాలని పలువురు వక్తలు సూచించారు. పిఠాపురం పట్టణ శివారు నరసింగపురం రోడ్డులోని దంగేటి వారి మామిడితోటలో ఆదివారం యాదవ కార్తీక వనసమారాధన జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలతో సందడిగా గడిపారు. ఉసిరిచెట్టు వద్ద పూజలు చేశారు. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.వెంగళ్రావు, జిల్లా అధ్యక్షుడు కుండల సాయికుమార్, టీడీపీ, జనసేన ఇన్‌చార్జిలు ఎస్వీ ఎస్ఎన్ వర్మ, మర్రెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ నాయకుడు డాక్టర్ కృష్ణంరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్లు యనమల కృష్ణుడు, కొయ్యా మురళి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'వాటర్ లెవెల్ గేజ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు'



సమావేశంలో మాట్లాడుతున్న గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ సునీల్‌కుమార్

పిఠాపురం/కొత్తపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏలేరు, పీబీసీ ప్రాంతంలో వాటర్ లెవెల్ గేజ్‌లు ఏర్పాటు చేయాలని గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ ప్రతిపాదించారు. పిఠాపురంలోని ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్న వరద నీటితో పంట పొలాలు, గ్రామాలు ముంపునకు గురికాకుండా ఉండేందుకు రెగ్యులేటర్లు, కళింగల్స్, స్లూయిస్‌ల వద్ద వీటిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పిఠాపురం బ్రాంచి కెనాల్‌కు సామర్లకోట కెనాల్ నుంచి గోదావరి జలాలు, 2ఆర్ రెగ్యులేటర్, గొల్లప్రోలు కళింగల్ నుంచి ఏలేరు జలాలు వచ్చి కలుస్తుండడంతో అధిక నీటిమట్టం ఏర్పడుతోందని తెలిపారు. అవసరం మేరకు నీటి వినియోగం కోసం ఈ గేజ్‌ల ఏర్పాటుతో ప్రయోజనం ఉంటుందని అభిప్రాయపడ్డారు. వీటిని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఇరిగేషన్ ధవళేశ్వరం సర్కిల్ ఎస్ఈ గోపీనాథ్, పీబీసీ డీఈఈ సంతోష్‌కుమార్‌లతో కలిసి సునీల్‌కుమార్ పీబీసీ కెనాల్ పరిధిలో కాలువల రెగ్యులేటర్లు, వంతెనలు, స్లూయిస్‌లను పరిశీలించారు.

నిరంతరం ప్రజా సేవలోనే ఉంటా: వర్మ



పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మను సత్కరిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

పిఠాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిరంతరం పిఠాపురం నియోజకవర్గ ప్రజల సేవలోనే ఉంటానని, వారి కష్టసుఖాల్లో వెన్నంటి ఉంటానని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పేర్కొన్నారు. మొంథా తుఫాన్ సమయంలో అందించిన సేవలకు సీఎం చంద్రబాబు నుంచి సైక్లోన్ ఫైటర్ అవార్డు అందుకున్న వర్మను ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి సత్కరించారు. పట్టణ, మండల శాఖల అధ్యక్షులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శేష వాహనంపై వేణుగోపాలస్వామి

పిఠాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసియున్న రుక్మిణీ, సత్యభామ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం అర్చకుడు పి.విజయజనార్దనాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను శేష వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి నున్న శ్రీరాములు, ఆలయ అభివృద్ధి సేవా సమితి అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.



శేష వాహనంపై వేణుగోపాలస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం





కాకినాడలో భానులింగేశ్వరస్వామి, సామర్లకోటలో గణపతి ఆలయాల్లో పూజలు చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు



ఎమ్మెల్సీ పద్మశ్రీని సత్కరిస్తున్న దృశ్యం

ఘనంగా ఆర్యవైశ్య కార్తీక వనసమారాధన

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మెక్లారిన్ స్కూలు మైదానంలో ఆదివారం 29వ ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ ఐకమత్యం అంటే ఒకరికొకరు అండగా నిలబడటమేనన్నారు. ఉమ్మడి లక్ష్యాల కోసం కలిసి పని చేయాలన్నారు. స్నేహ బంధాలను పెంచుకోవడమేనని కార్తీక వనసమారాధన ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం ఎమ్మెల్సీ పద్మశ్రీని ఆర్యవైశ్య పెద్దలు, వాసవి మహిళా సేవా సంఘాల ప్రతినిధులు సత్కరించారు.



మీడియాతో మాట్లాడుతున్న పునః ప్రతిష్ఠ కమిటీ సభ్యులు

7న అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక భానుగుడి పోలీస్ రిజర్వు లైన్‌లో గల అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహాన్ని పునః ప్రతిష్ఠ చేయనున్నట్టు కమిటీ ఛైర్మన్ పిల్లి కృష్ణకల్యాణ్, సభ్యులు శివరామకృష్ణ, సుబ్రహ్మణ్యం తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వారు వెల్లడించారు. గతంలో ఉన్న ఆలయాన్ని పూర్తిగా పడగొట్టి రాతితో శబరిమల తరహాలో కొత్తది నిర్మించామన్నారు. వారాహి అమ్మవారి విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠిస్తామన్నారు. ఈ నెల 5వ తేదీ సాయంత్రం ప్రాకార శుద్ధి, గణపతి పూజ రక్షా హోమం, రక్షా కలశం, వాస్తు హోమం, 6న అయ్యప్ప స్వామి విగ్రహానికి బింబ శుద్ధి, చతుర్ శుద్ధి, జీవ కలశ పూజ, ఆదివాస హోమం జరుపుతామన్నారు. 7వ తేదీన అయ్యప్పస్వామి విగ్రహాన్ని శబరిమల ఆలయ తంత్రి రాజీవ్ పునః ప్రతిష్ఠ చేస్తారన్నారు.

వేలు గురుస్వామి ఆశీస్సులతో తొలిసారి మహాబ్రహ్మ కలశాభిషేకం నిర్వహిస్తామని, అనంతరం ప్రసన్న పూజ, హారతి జరుపుతామన్నారు. ఐదువేల మంది స్వాములు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు పిల్లా సురేష్, మెహర్‌రెడ్డి, డి.వర్మ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

సామర్లకోట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో ఆదివారం సామర్లకోట ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అంబటి అప్పారావు-మారేశ్వరి కుటుంబసభ్యుల సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఈ వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ శ్రీధర్ తదితర వైద్య సిబ్బందితో సుమారు 120 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యానందం, మణిరాజు, విప్పర్తి కొండలరావు, సింగంపల్లి శ్రీనివాసు, బుల్లిరాజు, ప్రసాద్ నజీర్, నాయుడు మాస్టారు, గుండు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జనసేన నాయకుడు ఓదూరి నాగేశ్వరరావు-వీరలక్ష్మి దంపతులు, వారి కుమారులు పేదలకు 600 దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం మహాన్నదానం నిర్వహించారు. 15 సంవత్సరాలుగా ఏటా క్షీరాబ్ది ద్వాదశి రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నాగేశ్వరరావు తెలిపారు.

తుమ్మలపల్లి నివాళి

గండేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడులో మండల సీనియర్ నాయకులు మేడిబోయిన శ్రీను తండ్రి అబ్బులు మొదటి సంవత్సరీక కార్యక్రమం నిర్వహించారు. జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరై అబ్బులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంటన జనసైనికులు ఉన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

రూటు మార్చిన ఇసుక దొంగలు...

● జామాయిల్ తోట నుంచి తాత్కాలిక రహదారి ఏర్పాటు



జామాయిల్ తోటలో రహదారి నుంచే ఇసుక రవాణా చేసేది

ఎటపాక, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమార్కులు ఇసుక దందాను ఆపేది లేదనట్టుగా ఇసుక అక్రమ రవాణాకు మరో మార్గాన్ని ఎంచుకున్నారు. మూడు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో ఇసుక దందాకు అడ్డేది అనే శీర్షికన వార్తా కథనం ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారులు స్పందించి పురుషోత్తపట్నం గోదావరి నదికి వెళ్లే మార్గంలో యంత్రాలతో కందకాలు తవ్వించారు. దీంతో ఆ మార్గంలో ఇసుక ట్రాక్టర్లు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. రెండు రోజుల పాటు ఇసుక అక్రమ రవాణా నిలిచిపోయింది. ఈనేపథ్యంలో ఇసుక అక్రమార్కులు మరో బాటను ఎంచుకున్నారు. ఇసుక దందా నడిపే ముఠా దీనికి అతిసమీపంలో ఓ జామాయిల్ తోటలో నుంచి గోదావరి నదీలోకి తాత్కాలిక బాటను ఏర్పాటుచేసుకున్నారు. ఆ బాటలో అర్ధరాత్రి సమయాల్లో ఇసుకను తెలంగాణ (భద్రాచలం పట్టణం)కు తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారులు అడపాదడపా దాడులు చేస్తున్నారనే తప్ప, పూర్తిస్థాయి నిఘాతో చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం ఇసుక డంప్‌లో వారం రోజులుగా ఇసుక అమ్మకాలు నిలిపివేయడంతో ఇసుక కొరత ఏర్పడుతోంది. ఇది ఇసుక అక్రమ రవాణాదారులకు కలిసొచ్చినట్లుగా మారుతోంది.

సరిహద్దుల్లో జోరుగా పేకాట!

మోతుగూడెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలో కాలక్షేపంగా మొదలైన పేకాట వ్యసనంగా మారుతుంది. పేకాటతో ఇళ్లు గుల్లవుతున్నాయి. స్వరం పోగొట్టుకొని అప్పులు పాలవుతున్నారు. మద్యానికి బానిసై అప్పులు బాధ భరించలేక ప్రాణాలు తీసుకుంటున్నారు. ఏజెన్సీలో ఆంధ్ర. ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో పేకాట జోరుగా సాగుతున్నట్లు సమాచారం. ఒడిశా ఆంధ్ర ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు సిండికేట్ గా ఏర్పడి మోతుగూడెం, పొల్లూరు, ఆంధ్రా, ఒడిశా అటవీ ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నారు. ప్రతిరోజు రూ.లక్షల్లో చేతులు మారుతున్నాయి. పోలీసులు దాడులు చేసి కేసులు పెడుతుంటే వేరే ప్రాంతానికి వెళ్లి పేకాట ఆడుతున్నారు తప్ప మానడం లేదు. సామాన్యులు నుంచి సంపన్నులు వరకు పేకాటలో మునిగిపోతున్నట్లు తెలిసింది. పేకాట ఆడేవారికి సొమ్ము అవసరమైతే అక్కడికక్కడ అప్పు ఇచ్చేవారు కూడా ఉన్నారు. వస్తువులు, వాహనాలు తాకట్టు పెట్టి అధిక వడ్డీకి అప్పులు తీసుకుని ఆటలో మునిగిపోతున్నట్లు తెలిసింది. దీనిపై మోతుగూడెం ఎస్ఐ ఎస్.కె.సాదిక్ మాట్లాడుతూ పేకాటను ఉపేక్షించేది లేదని, దాడులు చేస్తూ పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తామన్నారు. పేకాట ఆడుతూ పట్టుబడితే ఎంతటి వారినైనాసరే చర్యలు తప్పవన్నారు.

అవినీతికి తావివ్వద్దు



ప్రతిజ్ఞ చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

మోతుగూడెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం ఆదివారం విజిలెన్స్ అవేర్నెస్ వీక్‌లో భాగంగా ఏపీ జెన్కో విజిలెన్స్ ఎస్పీ ఆదేశాల మేరకు చివరి రోజు విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో మోతుగూడెం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏపీఎస్ఈ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ హాల్‌లో లోయర్ సీలేరు ఏపీ జెన్కో ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, సెక్యూరిటీ ఇంచార్జ్ అధికారి టికె ప్రసాద్ బాబు సమగ్రత, నిజాయితీ అంశాలపై అవగాహన కల్పించారు. సెక్యూరిటీ విధి నిర్వహణలో అవినీతికి తావివ్వొద్దన్నారు. అక్టోబర్ 27 నుంచి నవంబరు 2 వరకు జరిగిన విజిలెన్స్ అవగాహన కార్యక్రమాలు జెన్కో ఆస్తులు పరిరక్షణకు దోహదం చేస్తాయన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిబ్బందితో సదస్సును నిర్వహించి ఇంటిగ్రిటీ ప్రతిజ్ఞ చేశారు.

నిరుపేదలకు రగ్గుల పంపిణీ

మోతుగూడెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో ఆదివారం రాజమండ్రికి చెందిన స్టార్ హెల్త్ జనరల్ మేనేజర్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మైలవరం కిరణ్ ఆదివారం నిరుపేదలకు రగ్గులు పంపిణీ చేశారు. సీలేరు నుంచి మోతుగూడెం వరకు మార్గ మధ్యలో ఉన్న నిరుపేదలకు రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీటీ రామారావు, ఇమ్మంది నరసింహమూర్తి, జంగా రాము తదితరులు పాల్గొన్నారు

108లో గర్భిణి ప్రసవం



ఎటపాక, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): 108అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవించింది. ఆదివారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం అయ్యవారిపేట గ్రామానికి చెందిన కె.సంధ్యకు ఆదివారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌ను సంప్రదించారు. దీంతో 108లో గర్భిణి సంధ్యను ప్రసవం కోసం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో వెంకటరెడ్డిపేట గ్రామం వద్దకు రాగానే పురిటి నొప్పులు అధిక అయ్యాయి. దీంతో 108 వాహనాన్ని నిలిపి 108సిబ్బంది కృష్ణార్జున్, పైలట్ చందు, ఆశ కార్యకర్త ఆమెకు పురుడు పోశారు. దీంతో ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీ, బిడ్డను భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు.

వాహనాల తనిఖీ

దేవీపట్నం, నవంబరు2(ఆంధ్రజ్యోతి):ఇందుకూరుపేట రోడ్డులో ఆదివారం దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ తన సిబ్బందితో ఆదివారం వాహనాలు తనిఖీ చేపట్టారు. కార్లు, ద్విచక్ర, ఇతర వాహనాలు నిలుపుదల చేసి రికార్డులు పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేకపోయినా, సీటు బెల్టు, హెల్మెట్ ధరించకపోయినా చలాన విధించారు. వాహనదారులు నిబంధనలు పాటించాలన్నారు.

ఆదివాసీల హక్కుల సాధనకు పోరుబాట

దేవీపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ డిసెంబరు 15న రంపచోడవరంలో నిర్వహించ తలపెట్టే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆదివాసీ నాయకుడు తెల్లం శేఖర్ కోరారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో అన్ని ఉద్యోగాలు ఆదివాసీలకే కేటాయించాలనే డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. 1/70చట్టం, పెసా చట్టం, అటవీ హక్కుల చట్టం, 2013 పోలవరం భూసేకరణ చట్టాలు ఇప్పటికీ పటిష్ఠంగా అమలుకాకుండా ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు.

హక్కులు సాధించుకోవాలి

దేవీపట్నం, నవంబరు2(ఆంధ్రజోతి): ప్రతీఆదివాసీ చట్టాలు తెలుసుకుంటేనే హక్కులు పొందగలమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. ఆదివారం ఇందుకూరు-1 ఆర్అండ్ఆర్ కాలనీలో చైతన్య సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు ఆదివాసీల చట్టాలు విస్మరించి నాన్ ట్రైబల్స్‌కి తొత్తులుగా ఉంటున్నారని, చట్టాలు అమలుకు కృషిచేయడం లేదని విమర్శించారు. చట్టాల అమలుకు సంక్షేమ పరిషత్‌తో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ నాయకులు చోడి ప్రదీప్‌కుమార్‌దొర పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

చెరువులకు జలకళ



పెదశంకర్లపూడిలో చెరువు నుంచి పొర్లి బయటకు వస్తున్న నీరు

ప్రత్తిపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో చెరువులకు జలకళ వచ్చింది. మొంథా తుపాన్ కారణంగా 4 రోజులు పాటు కురిసిన భారీ వర్షాలు వల్ల మండలంలోని చెరువులు సంమృద్ధిగా జలాలతో నిండుకుండలా మారాయి. ప్రత్తిపాడులోని ఊర చెరు వు, పుత్ర చెరువు, దేవులపల్లి చెరువుతో పాటు ధర్మవరంలోని రామభద్ర రాజు చెరువు, రాచపల్లి కొత్త చెరువు, ఒమ్మంగి రాజు, గోపాలుడు చెరువు, శరభవరం పెద్ద చెరువు, చింతలూరు, రామానుజం చెరువు, పెదశంకర్లపూడి వెంకన్న దొర చెరువు, ఏలూరు వెంకటపతి రాజు చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. పెదశంకర్లపూ డి వెంకన్న దొర చెరువు, ఒమ్మంగి రాజు చెరువు పొర్లు కట్టడాల మీదుగా అదనపు జలాలు బయటకు తరలివస్తున్నాయి. ఆయా చెరువుల కింద చిరుపొట్ట దశలో ఉన్న వరి పంటలకు ఈ ఏడాది నీటి కొరత ఉండదని రైతులు చెబుతున్నారు.



నీళ్లతో కళకళలాడుతున్న వెంకన్న దొర చెరువు

అవసరం వస్తే ముందుంటా

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



ఆర్యవైశ్య మినీ కల్యాణ మండపానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గండేపల్లి ఆర్యవైశ్య సంఘం మినీ కల్యాణ మండపానికి ఆదివారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శంకుస్థాపన నిర్వహించారు. ఆర్యవైశ్య వన భోజనాల్లో సహపంక్తి భోజనం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ఏ అవసరమొచ్చిన తాను ముందుంటానని, మినీ కల్యాణ మండపం నిర్మాణానికి ప్రభుత్వ సహకారం కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు ఉన్నారు.

సచివాలయ భవనాన్ని పూర్తి చేయండి!



గిడజాంలో తుప్పలతో ఉన్న సచివాలయ భవనం

రౌతులపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గిడజాం సచివాలయం భవనం చూట్టూ తుప్పలు అలముకున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో సూమారు రూ.40 లక్షలతో సచివాలయ నిర్మాణం చేపట్టారు. కానీ ఐదేళ్లలో భవనాన్ని పూర్తిచేయలేకపోయారు. 2స్లాబ్‌లు వేసి గోడలు మాత్రం నిర్మించి వదిలివేశారు. ప్రస్తుతం ఈ భవనంపై తుప్పలు అలముకున్నాయి. ఫెక్సీలు పెట్టుకోవడానికి, మందుబాబులకు ప్రసుత్తం ఈ భవనం ఉపయోగపడుతుంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పట్టించుకుని ఈ భవనాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అయ్యప్పస్వామి ఊరేగింపు



మల్లేపల్లిలో గుర్రపుబండిపై అయ్యప్పను ఊరేగిస్తున్న దృశ్యం

గండేపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లిలో ఆదివారం అయ్యప్పస్వామి పడి పూజ కార్యక్రమంలో భాగంగా స్వామివారిని విద్యుద్దీపాలంకరణతో గుర్రపుబండిపై గ్రామమంతా ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అధికసంఖ్యలో స్వామిభక్తులు హాజరయ్యారు. హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం రాత్రి ఆంజనేయగురుస్వామి వేదమంత్రాల నడుమ 12గంటలకు పడిపూజ చేపట్టారు.

రైతుల గగ్గోలు

గండేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాను ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసిన సంగతి తెలిసిందే. అయితే ఆ వర్షాలకు మండలంలో సుమారు 40శాతానికి పైగా వరి కోతలు అయినప్పటికీ మిగతా పంట నష్టం వాటిల్లింది. ఈదురుగాలులకు పంట మొత్తం నేలమట్టం కావడంతో గింజలు రాలిపోవడంతో పాటు యంత్రాలు కోయడానికి కూడా అధిక పెట్టుబడి అవుతున్నాయని రైతులు చెపుతున్నారు. ఎకరానికి గంటకు రూ.3 వేలు నుంచి 3500 తీసుకుంటున్నారు. అయితే పొలం నిలబడి ఉంటే ఒక గంటలో కోత పూర్తవుతుందని కానీ పంట పూర్తిగా నేలమట్టం కావడంతో ఎకరం కోయడానికి రెండు గంటల నుంచి మూడు గంటలు అవుతుంది. దీంతో ఎకరానికి రూ.5వేలు వరకు అదనంగా అవుతుందని రైతులు చెపుతున్నారు. కోత కూలీ అదనపు ఖర్చులు అవుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో సుమారు 5500 ఎకరాల్లో వరిసాగు చేపట్టారు.

మహిళలు అన్నింటా విజయం సాధించాలి

● ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ● భారత క్రికెట్ మహిళా జట్టు కోసం పూజలు



శంఖవరం: సీతంపేట దుర్గామీనాక్షి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, నేతలు

శంఖవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళల ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత మహిళల జట్టు విజయం సాధించాలని ఎమ్మెల్యే సత్యప్రభ ఆధ్వర్యంలో కూటమి నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం సీతంపేట దుర్గామీనాక్షీ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యప్రభ మాట్లాడుతూ మహిళలు అన్నింటా విజయం సాధించాలని, ప్రపంచానికి భారత మహిళల సత్తా ఏంటో ఈ విజయం ద్వారా తెలియాలని కోరారు. హర్మన్ ప్రీత్ సారథ్యంలో భారత జట్టు ఎనలేని విజయాలను సొంతం చేసుకుందని ఫైనల్‌లో విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్రసంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్, ఏపీఆర్డీసీ డైరెక్టరు వెన్నా ఈశ్వరుడు, బద్ది రామారావు, కీర్తి సుభాష్, పోలం చిన్నా, ఆత్మా వైస్ చైర్మెన్ కరణం సుబ్రహ్మణ్యం, కర్రి శివాజీ, జనసేన మండలాధ్యక్షుడు గాబు సుభాష్, తలపంటి బుజ్జి తదితరులు ఉన్నారు.

యర్రవరంలో....

ఏలేశ్వరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళల ప్రపంచ కప్‌లో భారత్ విజయం సాధించాలని టీడీపీ నాయకులు కార్యకర్తలు యర్రవరం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో స్క్రీన్ ద్వారా క్రికెట్‌ను అభిమానులు వీక్షించారు. టీడీపీ మండలాధ్యక్షులు జ్యోతుల పెదబాబు, బస్వా ప్రసాద్, పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, యండగుండి నాగబాబు, కోనాల వెంకట రమణ, రాయుడు చిన్న, టీడీపీ నాయకుడు పతివాడ రమేష్ తదితరులు ఉన్నారు.



ఏలేశ్వరంలో మహిళల ప్రపంచ కప్ క్రికెట్ మ్యాచ్‌ను స్క్రీన్ ద్వారా వీక్షిస్తున్న మహిళలు

వీధి కుక్కలతో భయం భయం...

గండేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గండేపల్లి మండలంలో హైవే నుంచి జడ్.రాగంపేట లోపలికి వెళ్లే దారిలో వీధి కుక్కలు గుంపు గుంపులుగా స్వైర విహారం చేయడంతో ఆ రహదారిన వెళ్లడానికి గ్రామస్తులు బిక్కుబిక్కుమంటున్నారు. రాత్రి వేళల్లో మరీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కలను నివారించాలని వారు కోరుతున్నారు.



గండేపల్లి మండలం జడ్.రాగంపేట వెళ్లే దారిలో గుంపులుగా ఉన్న వీధి కుక్కలు

అల్పాహారం వితరణ

జగ్గంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట వినాయక, అయ్యప్ప, సుబ్రహ్మణ్యస్వామి ఆలయం నందు అయ్యప్ప స్వామి మాలధారణ చేసిన భక్తులకు మామిళ్ళపల్లి అయ్యప్ప గురుస్వామి ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం అల్పాహారం అందించనున్నారు. జగ్గంపేటకు చెందిన సుంకర వెంకట స్వామి నాయుడు, నాగమణి దంపతుల కుమార్తె డాక్టర్ మంజూష స్వాముల కోసం అల్పాహార విందును ఏర్పాటు చేయడం జరిగింది.

స్మార్ట్‌గా తుని రైల్వేస్టేషన్

రూ.11 కోట్లతో తొలిదశ పనుల పూర్తి

ప్లాట్‌ఫారం, టిక్కెట్ కౌంటర్ల ఆధునికీకరణ



తుని రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకంలో జరిగిన పనుల్లో భాగంగా తుని రైల్వేస్టేషన్ స్మార్ట్‌గా దర్శనమిస్తుంది. సరికొత్త అందాలతో ప్రయాణికులను ఆకట్టుకుంటుంది. ఇటు ఏజెన్సీ గ్రామాలతో పాటుగా తుని, మెట్ట ప్రాంతాల వారి ప్రయాణానికి ఈ రైల్వేస్టేషన్ ఎంతో కీలకం. దీంతో రైల్వే శాఖ అనేక వసతులు అందుబాటులోకి తీసుకొచ్చి భవన నిర్మాణాలు కూడా పూర్తి చేశారు. 2023 చివరిలో రూ.19.13 కోట్లతో ఈ రైల్వేస్టేషన్ పనులకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ పనులు 2024 నుంచి వేగం పుచ్చుకుని రూ.11కోట్లతో తొలి విడత పనులు పూర్తయ్యాయి. త్వరలో ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. రైల్వేస్టేషన్‌లో టిక్కెట్ కౌంటర్లు, ప్లాట్‌ఫామ్‌పై షెడ్లు ఆదునీకరించి కొత్తగా పై కప్పు రేకులు, నడిచి వేళ్లేందుకు గ్రానేట్ రాళ్లు వేశారు. కొండవారి పేట తూము దారి సమీపంలో 1,2 ప్లాట్‌ఫారం నుంచి రాకపోకలు సాగించడానికి పాదచారుల కోసం మరో వంతెన పూర్తి చేశారు. ప్రాంగణంలో వాహనాల పార్కిం గ్ సదుపాయం ఏర్పాటు చేశారు. ప్రయాణికుల రాకపోకలకు విశాలంగా అభి వృద్ధి పరిచారు. ప్లాట్‌ఫామ్ పై విశ్రాంతి, మరుగుదొడ్లు, మూ త్రశాలలు ఏర్పాటు చేశారు. ముఖ ద్వారం అందంగా తీర్చిదిద్దడంతో పాటు వివిధ రకాల మొక్కలు నాటారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

నేడు ప్రత్తిపాడులో కోటి దీపోత్సవం



కోటి దీపోత్సవానికి చేస్తున్న ఏర్పాట్లు

ప్రత్తిపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో డీసీసీబీ వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో సోమవారం కోటి దీపోత్సవం కార్యక్రమం నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ప్రదేశాన్ని పరిశుభ్ర పరిచి 5వేల మంది భక్తులు పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేశారు. 250 మంది జంటలు రుద్రాభిషేకం, అష్టోత్రం, మహాన్యేత పంచ హారతిలో పాలొననున్నారు. వేద పండితులు తేజోమంతుల సుబ్రహ్మణ్య శర్మ, గురు భవాని, పత్రి రమణ కమిటీ సభ్యులు గానాల గంగాధర్, చిలకవర్తి వీరభద్రం, మార్లపూడి అప్పలరాజు సన్నాహల్లో భాగస్వాములయ్యారు. ఈ కోటి దీపోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్య అతిథిగా విచ్చేస్తారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వెలుగుల నాని దంపతులు, అంబటి రాంబాబు దంపతులు వేదికపై పీటలపై కూర్చుని పూజలు చేస్తారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరంపాలెం గ్రామానికి మంగళ, బుధవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, ఏఈ కిరణ్‌కిషోర్ తెలిపారు. సింగరంపాలెం నూతన సబ్‌స్టేషన్ పనుల్లో భాగంగా అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముద్రగడతో పళ్లంరాజు భేటీ



ముద్రగడతో మాట్లాడుతున్న పళ్లంరాజు

కిర్లంపూడి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభంను ఆదివారం కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు కలిసి భేటీ అయ్యారు. పలు విషయాలపై ఇద్దరూ చర్చించుకున్నారు. ముందుగా పళ్లంరాజును వైసీపీ ప్రత్తిపాడు కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు స్వాగతం పలికారు.

కనకదుర్గమ్మకు పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న దుర్గమ్మ

గండేపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో మురారి శివారు మామిడితోటలో వెలసిన కోరిన కనకదుర్గమ్మను కార్తీక మాసం సందర్భంగా ఆదివారం చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయకమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు.

లక్ష్మీనారాయణ హోమం



ఉప్పలపాడులో హోమం దృశ్యం

గండేపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపం ఆవరణలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని క్షీరాబ్ది ద్వాదశ సందర్భంగా ఆలయ పురోహితులు బొల్లాప్రగడ వెంకటేశ్వరశర్మ, చింతా వినయ్‌శర్మ ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ హోమం నిర్వహించారు. సర్పంచ్ అడబాల రామాంజనేయుల దంపతులు, కుటుంబీకులు హోమం చేపటారు. మహిళలు లలితా సహస్రాన్ని పఠించారు. భారీ అన్నదానం, సాయంత్రం స్వాముల పడిపూజ జరిగింది. అడబాల భాస్కరరావు, తమటం నాగేంద్ర, కంటిపూడి సత్యనారాయణ, తమటం భద్రరావు తదితరులు ఉన్నారు.

'ఎర్రన్నాయుడు సేవలు మరువలేనివి'

రౌతులపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీకి, కేంద్రమంత్రిగా, రాష్ట్రమంత్రిగా దివంగత నేత కింజారపు ఎర్రన్నాయుడు చేసిన సేవలు మరువలేనివని టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు అన్నారు. మూలగపూడిలో సత్యనారాయణ స్వగృహంలో, రౌతులపూడిలో భాస్కరరావు స్వగృహంలో ఎర్రన్నాయుడు 13వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. గాడి రాంబాబు, పైలా దివాణం, యువనేత ఇటంశెట్టి అశోక్ తదితరులు ఉన్నారు.